

కోతకు గురైన కల్వర్టు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని బొయితిలి పంచాయితీ రాసవీధి కల్వర్టు కోతకు గురైంది. దీంతో కిల్లంకోట పంచాయితీ కోడిమామిడి గ్రామానికి జియో టవర్ మెటీరియల్ తీసుకెళ్తున్న జీపు కల్వర్టు గోతిలో కూరుకుపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరిపించుకున్నారు. గ్రామస్తుల సాయంతో చాలా సేపు శ్రమించి జీపును బయటకు తీశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని తాత్కాలిక పూర్తిస్థాయిలో వంతెన నిర్మించాలని కోరారురాసవీధి గ్రామ సమీపంలో కోతకు గురైన కల్వర్టును పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ త్వరితంగా కలవర్టు పునర్నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. పెదలోచలి గ్రామంలో ఉచిత రేషన్ బియ్యాన్ని ప్రజలకు అందజేశారు.



కల్వర్టులో ఇరుక్కుపోయిన జీపు

ఒక రోజు తగ్గి.. మరో రోజు పెరిగి..

దోబూచులాడుతున్న గోదావరి

- శాంతించిన శబరి
- ఇంకా ముంపులోనే పలు గ్రామాలు

ప్రజాశక్తి-చింతూరు

గోదావరి ఒక రోజు తగ్గుతూ.. మరో రోజు పెరుగుతూ దోబూచులాడుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం ఉదయం 46.8 అడుగులకు చేరి రెండో ప్రమాద హెచ్చరిక నుండి దిగివచ్చి, మళ్లీ మధ్యాహ్నం నుండి పెరుగుతూ 47 అడుగులకు చేరింది. పేరూరు వద్ద క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో గోదావరి వరద నీరు రాత్రికి 50 అడుగులకు పెరిగే అవకాశం ఉందని సిడబ్ల్యుసి అధికారులు వెల్లడించారు. మరో వైపు శబరి నది శాంతించింది. శుక్రవారం సాయంత్రానికి 38 అడుగులకు చేరింది. దీంతో భద్రాచలం -చింతూరు రహదారి ముంపు నుండి బయటపడటంతో వాహనాలు యధావిధిగా రాకపోకలు సాగించాయి. చింతూరు మండలంలోని సోకిలేరు, కోయ్ గురు, కొమ్మూరు వాగులు ఇంకా పొంగి ప్రవహిస్తూనే ఉన్నాయి. గ్రామాలకు రాకపోకలు ఇంకా మెరుగుపడలేదు. బోట్లు నాటుపడవలతో అధికారులు ముంపు గ్రామాలకు నిత్యవసర సరుకులు తరలిస్తున్నారు. శుక్రవారం ఉదయం నుండి వర్షం లేని కారణంగా కొంతవరకు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి పలు ప్రత్యేక దారుల ద్వారా చేరుకొని అష్ట కష్టాలు పడుతూ నిత్యవసరాలు తీసుకెళ్లారు.

ఎటపాక : ముంపు గ్రామాల ప్రజలను గోదావరి కలవరపెడుతోంది. సోమవారం నుండి మురుమూరు గ్రామానికి రాకపోకలు నిలిచి జల దిగ్బంధనంలో చిక్కుకుంది. బియ్యం తప్ప నిత్యవసరాలు, కాయగూరలు రాలేదంటూ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ మురుమూరు, నందిగామ గ్రామాలలో పర్యటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, పారిశుధ్య నిర్వహణ చేయాలని అధికారులకు సూచించారు.

వరద నీటిలో విద్యుత్ సిబ్బంది పని

వరద తగ్గుతున్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ జెఈ రాజ్ కపూర్, సిబ్బందితో సాయంతో వరద నీటిలో పడవలో వెళ్లి విద్యుత్ సదుపాయానికి అంతరాయం లేకుండా కరెంటు వైర్లకు చిక్కుకున్న చెత్తను, కొమ్మలను తొలగించారు.

కూనవరం : కూనవరం, టేకులబోరు గ్రామాలు సగానికి పైగా ఖాళీ అయ్యాయి. నిత్యావసర సరుకులు, ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు, బ్లీచింగ్ చల్లించడం వంటి పనులు రెవిన్యూ అధికారులు ముమ్మరం చేసారు. కోతులగుట్టలోని పునరావాస కేంద్రాల్లో వరద బాధితులు ఉన్నారు. గోదావరి మళ్ళీ పెరుగుతుండడంతో ముంపు వాసుల గుండెల్లో ఒకింత భయపడుతున్నారు.

విఆర్.పురం : మండలంలోని పలు గ్రామాలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. వడ్డిగూడెం, శ్రీరామగిరి తదితర పంచాయతీల్లోని గ్రామాలు వరద ముంపులో ఉండడంతో పునరావాస కాలనీల్లో ఉంటున్న బాధితులు పడవల్లో తమ గ్రామాలకు వెళ్లి పరిస్థితిని చూసి వస్తున్నారు. పది రోజుల నుండి నీటిలోనే గృహాలు ఉండటం వలన కూలిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. పునరవాస కేంద్రాల్లో అధికారులు పట్టించుకోవడం లేదని, గహాలకు వెళ్దామంటే వరద తగ్గక పోవడంతో వెనుతిరిగి రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిత్యావసర సరుకులను పడవపై తరలిస్తున్న శ్రీరామగిరి సర్పంచ్ తదితరులు



వరద ముంపులో ఉన్న వడ్డిగూడెం గ్రామం

పునరావాస కేంద్రాల వద్ద పారిశుధ్య పనులు

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి ఉమ్మడివరం, రెడ్డి గుంపు పునరావాహస కేంద్రాల్లో సర్పంచ్ పూనం సరోజిని, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, పంచాయతీ సెక్రెటరీ శివప్రసాద్ ఆధ్వర్యాన పారిశుధ్య పనులు చేస్తున్నారు. ఎక్కడికి అక్కడ బ్లీచింగ్ జల్లించారు. ఈ సందర్భంగా శుక్రవారం సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ వరద ముంపు గ్రామాల నుండి ఇక్కడికి వచ్చి గుడారాలు వేసుకొని నివాసముంటున్న వారు వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య పనులు చేస్తున్నట్లు చెప్పారు.

నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ

విఆర్.పురం : మండలంలోని రామవరం గ్రామంలో ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మ చేతుల మీదుగా ముంపు బాధితులకు కూరగాయలు శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే రేఖపల్లి పంచాయతీ అన్నవరం, ఉమ్మిడివరం, రెడ్డిగుంపు వరద ముంపు గ్రామాలలో సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, ములకపల్లిలో ఆ గ్రామ సర్పంచ్ సవలం మారయ్య కూరగాయలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, వడ్లది రమేష్, టిడిపి నాయకులు ప్రకాష్‌రావు, రామారావు, సచివాలయం సిబ్బంది బుచ్చిరాజు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని కూటూరు పంచాయితీ ముల్లూరు గ్రామంలో పప్పు, మంచినూనె, ఇతర నిత్యావసర సరుకులు, కొవ్వొత్తులను సర్పంచ్ బొగ్గా వెంకమ్మ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది సోమక సత్యనారాయణ, విఆర్ఓ బ్రమ్మయ్య పాల్గొన్నారు.

దోమ తెరలు పంపిణీ

విఆర్.పురం : మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో బాధితులకు దోమతెరలు, పాలు, టార్చ్ లైట్లు, సాల్ట్, కిరోసిన్ తదితర సామగ్రిని సర్పంచ్ పులి సంతోష్ కుమార్ చేతుల మీదుగా వరద బాధితులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు సమయంలో ఎటూ వెళ్లడానికి అవకాశం లేని వారు గుట్టలపై గుడారాలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులతో మాట్లాడి సామాగ్రిని పడవలపై తీసుకొచ్చి పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోడిసల దుర్గారావు, పంచాయితీ కార్యదర్శి ఎన్ఎల్ సౌజన్య, గంగవరం ఇఒపిఆర్‌డి నరసింగరావు, గ్రామ పెద్దలు పులి ధర్మరాజు, ఎన్.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, రేషన్ డీలర్ పాల్గొన్నారు.

అలాగే మండలంలోని వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, ధర్మతాలగుడెం గ్రామాలు ముంపునకు గురి కాగా, వారంతా రేఖపల్లి గ్రామంలో గుడారాలు వేసుకొని నివసిస్తున్నారు. వారికి శుక్రవారం స్థానిక సర్పంచ్ పూనం సరోజినీ, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, తహశీల్దారు, ఎంపీడీవో ఫణీంద్ర రెడ్డి చేతులమీదుగా దోమతెరలు అందజేశారు.

వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థల భరోసా

విఆర్.పురం : మండలంలోని గోదావరి వరదల ప్రభావంతో నీట మునిగి గుట్టలపై తలదాచుకుంటున్న వరద బాధితుల కోసం రోటరీ క్లబ్ వారు సుమారు 1000 మందికి దోమ తెరలు, మరో 120 టార్పాలిన్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఫణీంద్ర మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రతినిధులు రాంప్రసాద్, రమేష్ బాబు, సుకుమార్ రెడ్డి, గాజుల శ్రీనివాస్, ఈదర శ్రీనివాస్, పూర్ణ చందర్ తదితరులు సుమారు రూ.3 లక్షల విలువ గల దోమతెరలు, టార్పాలిన్ అందించినట్లు చెప్పారు. ఎఎస్‌డిఎస్ అధినేత వి.గాంధీబాబు కూడా సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు.

జెకెసి ట్రస్టు...

మండలంలోని ముంపునకు గురైన వడ్డిగూడెం గ్రామాన్ని జెకెసి ట్రస్టు అధినేత, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ టిడిపి నాయకులతో కలిసి శుక్రవారం సందర్శించి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎటపాక సిఐ రామారావు, విఆర్ పురం ఎస్సై నాగరాజు, ఏఎస్ఐ రాధాకృష్ణ, మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి నాయకులు కోట్ల రాజు, అరెవి సీతారాం, ముత్యాల సత్యనారాయణ, జెకెసి ట్రస్టు సభ్యులు ఇంతియాజ్ రియాజ్ రమణయ్య, యాకోబు పాల్గొన్నారు.



కూనవరం మండలం పెదార్కూరులో విద్యుత్ సమస్యపై నిరసన తెలుపుతున్న స్థానికులు

ప్రత్యామ్నాయ రహదారులు నిర్మించండి

జాయింట్ కలెక్టర్‌కు సిపిఎం వినతి



జెసికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఎటపాక

వరదల సమయంలో అత్యవసర సేవలు కోసం ప్రత్యామ్నాయ రహదారులను నిర్మించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్‌కు సిపిఎం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏటా వస్తున్న వరదల వలన నందిగామ, మురుమూరు, కామన్‌తోగు, చలంపాలెం, బండారుగూడెం, ఎర్రగట్టు, సొలెబుడప, చింతలపాడు, జగ్గవరం, తదితర గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయి, నిత్యవసర సరుకుల కొరకు, అనారోగ్యం సమయంలో వైద్య సేవలు పొందలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందుల నుండి బయటపడాలంటే ప్రత్యామ్నాయ రహదారి అవసరముందని చెప్పారు. దీనికి జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, నాయకులు ఇరపా అజయ్ కుమార్, బుద్దుల భద్రయ్య, నూతలపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చీకటి నుండి విముక్తి కల్పించాలని నిరసన

కూనవరం : మండలంలోని పెదార్కూరు విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆ పంచాయతీ సర్పంచ్ నాగమణి ఆధ్వర్యాన శుక్రవారం స్థానికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలు నుండి చీకటితో ఇబ్బంది పడుతున్నామని, ఆర్ అండ్ బి రోడ్డు వెంబడి కరెంట్ స్తంభాలు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి : జెసి అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-ఎటపాక : వరదలు ఉన్నంతకాలం ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ అన్నారు. వరద ప్రభావిత మురుమూరు, నందిగామ, గౌరీదేవిపేట గ్రామాలలో వరద సహాయక చర్యలను జాయింట్ కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. వరద ముంపు గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలకుండా ఎక్కడికక్కడ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మురుమూరు నుండి నందిగామ మధ్యలో రోడ్డు వరదలకు గురైన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మురుమూరు గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి ఏటా గోదావరి వరదలకు ఇబ్బందులు పడుతున్నామని, తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి తరలించాలని కోరారు. జెసి వెంట తహశీల్దారు శేఖర్, ఎంపీడీవో మురళీకృష్ణ తదితరులున్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



గెడ్డ వద్ద చిక్కుకున్న గిరిజనులు

మన్యంలో పొంగుతున్న గెడ్డలు

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా ఇదురుగాలతో వర్షం కురవడంతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గెడ్డలు దాటలేని పరిస్థితిలో ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గుమ్మ పంచాయతీ కడరేవు, కొట్టాంగుడ, గోపులపాలెం గ్రామాల గిరిజనులు ఆధార్ అప్డేట్ నిమిత్తం శుక్రవారం గుమ్మ పంచాయతీ సచివాలయానికి వెళ్లేందుకు బయలుదేరారు.ఆ సమయంలో గెడ్డ పొంగడంతో గమనించిన గిరిజనులు ఒడ్డు అవతల ఉండిపోయారు.

చింతపల్లి: మండలంలోని గొందిపాకల పంచాయతీ సమగిరి, ఎర్రవరం గ్రామాల సమీప కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్నారు. కాలువలో ద్విచక్ర వాహనాన్ని కర్రలతో జోలి కట్టి దాటించవలసిన పరిస్థితి ఏర్పడింది.వంతెనలు నిర్మాణం చేపడితే కాగులబంధ, పొర్లు బంద, వంటలమామిడి, తప్పల మామిడి తదితర గ్రామాలతో పాటు సుమారు ఎనిమిది గ్రామాల గిరిజనుల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని ఉల్లి దార మల్లేశ్వరరావు, సెగ్గే సోమరాజు, ఉల్లి సంజీవరావు, చెర్రీకి వెంకటేశ్వర్లు, ఉల్లి సింహాచలం, పాడి చిన్న సత్తిబాబు తదితరులు తెలిపారు.

ముంచింగిపుట్టు: సుమారు రెండు వారాలుగా మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలకు గిరిజనుల జలదిగ్బంధమయ్యారు. లక్ష్మీపురం, బుంగపుట్టు, బూసిపుట్టు, వనుగుమ్మ తదితర గ్రామ పంచాయతీ పరిధిలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. లక్ష్మీపురం పంచాయతీ బిర్రిగూడ గ్రామ సమీపంలో గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. ద్విచక్ర వాహనాలను కావడి కట్టి భుజాలపై మోసుకుంటూ గెడ్డను దాటారు. లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో సుమారు 11 వంతెనల నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా కేవలం మూడు బ్రిడ్జిల నిర్మాణాలు చేపడుతున్నారు.



గెడ్డలో బైక్‌ను మోసుకుంటూ వెళ్తున్న గిరిజనులు

నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

-కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి జరుగుతుండటంతో ప్రాధాన్యత
-హాజరుకానున్న కొత్త ఎంపీలు, ఎమ్మెల్యేలు
-ప్రజా సమస్యలపై చర్చ జరగాలని పలువురి ఆకాంక్ష

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి: శనివారం జరిగే ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రత్యేకతను సంతరించుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారి జరుగుతున్న సమావేశమిది. గత సమావేశం నాటికి ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలెవరూ ఇప్పుడు లేరు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటుకానున్న జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాలలో పాత ఎమ్మెల్యేలు, ఎంపీలలో ఒకరూ లేరు. హుకుంపేట జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం ఈసారి అరకు ఎమ్మెల్యేగా తొలిసారి జిల్లా పరిషత్ సమావేశంలో అడుగుపెట్టనున్నారు. పాయకరావుపేట, యలమంచిలి, నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, మాడుగుల, పెందుర్తి, భీమిలి, అరకు, పాడేరు ఎమ్మెల్యేల్లో యలమంచిలి, పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు సమావేశానికి తొలిసారి ఎన్నికై వస్తున్నారు. అరకు, అనకాపల్లి, విశాఖపట్నం ఎంపీలు డాక్టర్ తనూజారాణి, సిఎం.రమేష్, ఎం.శ్రీభరత్ కొత్తగా ఎన్నికయ్యారు.

ఎంతో అనుభవం, అవగాహన కలిగిన వారితో పాటు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు అడుగుపెట్టనున్న ఈ సమావేశానికి ప్రాధాన్యత వుంది. ఉమ్మడి జిల్లా సమస్యలపై పార్టీలకు అతీతంగా వాటి పరిష్కార నిమిత్తం ఏకోన్ముఖ అవగాహనకు రావాల్సివుంది. రాజకీయ బలాబలాలు ప్రదర్శించుకోకుండా, విమర్శలకు తావీయకుండా, ఆరోపణలకు దిగకుండా ప్రజాంశాలపై చర్చించి పరిష్కరించే మార్గాలు అన్వేషించాలి. ప్రజలకు మేలుచేసే వేదికగా జిల్లా పరిషత్‌ను తీర్చిదిద్దగలగాలి. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి, అందులోనూ జిల్లాకు జరిగిన అన్యాయంపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు నోరువిప్పాలి. తమ జిల్లా భవిష్యత్, అభివృద్ధికి ఒకరికొకరు కలిసి పనిచేయాలి. పరస్పర సహకారమందించుకోవాలి. ప్రజా సమస్యలపై మూకుమ్మడిగా కలిసినడవాలి. కేంద్ర బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కుతీసుకుంటున్నట్టు ప్రకటించలేదు. సరైన రీతిన నిధుల కేటాయింపూ లేదు. ఉక్కు పరిశ్రమకు ప్రమాదం పొంచివుందని సభ్యులు గ్రహించాలి. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సొంత గనులు కేటాయించాలని జిల్లా పరిషత్‌లో తీర్మానం చేసి ఉత్తరాంధ్ర ఆకాంక్షలు, కార్మిక సంఘాల పోరాటానికి బలాన్నివ్వాలి.

సాగునీటి సౌకర్యంలేక కరువుకాటకాలకు ఏటా నష్టపోతున్న రైతుకు శాశ్వత ఉపశమనం కలిగించే పోలవరం ఎడమ కాలువ పనులు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు ఎప్పటిలోగా పూర్తిచేయించగలుగుతామో జిల్లా పరిషత్ సమావేశం ద్వారా సందేశమందించాలి. కొత్త ప్రభుత్వంలో ఏర్పాటైన ఈ తొలి సమావేశంలో సాధారణ అజెండా అంశాలకు పరిమితం కాకుండా క్రియాశీలకంగా పనిచేస్తామన్న స్ఫూర్తిని, ప్రజా ఆకాంక్షలను గౌరవించి నడుచుకుంటామన్న విశ్వాసాన్ని అందరిలో కలిగించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు పేదలకు అందుతాయని, పేద పిల్లలు చదువుకొనే పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించగలుగుతామని మనస్ఫూర్తిగా చెప్పగలగాలి. మూతపడ్డ తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపై చెరుకు రైతుకు మేలుచేసే సముచిత నిర్ణయం తీసుకొనేందుకు ఇదొక వేదిక కావాలి.

ఫార్మా కాలుష్య నియంత్రణకు చిత్తశుద్ధితో కూడిన చర్యలు తీసుకొనేలా, తాడి తరలింపునకు పరిష్కారం దొరికేలా, కాలుష్య రహిత పరిశ్రమల రాకను ప్రోత్సహించి, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు నిధులు రాబట్టేలా, పరిశ్రమల్లో విద్యార్హతలు, నైపుణ్యాల ఆధారంగా నిర్వాసితులు, స్థానికులకు ఉపాధి కల్పించేలా, పరిశ్రమల్లో రక్షణ, భద్రత ప్రమాణాలు అమలుజరిగేలా జిల్లా పరిషత్ సమావేశంలో భాగస్వాములైన ప్రజాప్రతినిధులందరూ తమ బాధ్యతను గుర్తెరిగి వ్యవహరించాలి. అప్పుడే జిల్లా పరిషత్ వేదికకు గౌరవం దక్కుతుంది.

ఫీడర్ అంబులెన్స్‌లపై అలసత్వం

- పాడైతే డ్రైవర్లే మరమ్మతులు చేయించుకోవాల్సిన వైనం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో ఫీడర్ అంబులెన్స నిర్వహణపై ఆలక్ష్యం నెలకొంది. ఫలితంగా వీటిలో పనిచేస్తున్న డ్రైవర్ల పై భారం పడుతూ చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నారు. ఫీడర్ అంబులెన్స్‌ల వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి ఏజెన్సీలో తాము శుద్ధితో అందిస్తున్న సేవలను గుర్తించి తమకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ పీడర్ అంబులెన్సుల డ్రైవర్లు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు.

2018 సంవత్సరంలో అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రారంభించిన ఈ ఫీడర్ అంబులెన్స వ్యవస్థలో పని చేస్తున్న డ్రైవర్లకు ప్రస్తుతం నెలకు 12,194 రూపాయలు వేతనం చెల్లిస్తున్నారు. ఈ ఉద్యోగాలు ఇచ్చే ముందు డ్రైవర్లకు శిక్షణ అందించి ప్రతి సంవత్సరం 10 శాతం వేతనాలు పెంచుతామని ఐదు కిలోమీటర్ల పరిధిలోనే విధులు నిర్వహించవలసి ఉంటుందని, ఫీడర్ అంబులెన్స్‌ల మరమ్మతులు వస్తే సంస్థ ద్వారా నిర్వహించనున్నట్లు చెప్పారు. కానీ ఈ ఒప్పందాలు అమలు కాలేదు. ఫీడర్ అంబులెన్స మరమ్మతు వస్తే తామే బాగు చేయిస్తున్నామంటూ పలువురు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల మరమ్మతు చార్జీలు కూడా తమకు అంద లేదని, రసీదులు మాత్రం సంస్థకు అందజేస్తున్నామని. డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. 2018 లో ఇచ్చిన ఫీడర్ అంబులెన్స్ వాహనాలను ఇప్పటికీ వినియోగిస్తున్నామని తెలిపారు. 25 వాహనాలు బ్రేక్ డౌన్ అయ్యి మూలకు చేరాయని తెలిపారు. రోగులను ఆసుపత్రులకు తీసుకువెళ్లడానికి తమకు కాల్ సెంటర్ సౌకర్యం కూడా లేదని తామే స్వయంగా గ్రామాల్లోకి వెళ్లి పేషెంట్లు ఉంటే గుర్తించి వారిని ఆసుపత్రులకు తీసుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ విధంగా తమకు టార్గెట్లు పెట్టి పనులు చేయిస్తున్న పరిస్థితి ఉందని, లేనిపక్షంలో తమకు వేతనాల నుంచి కోత పెడుతున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఫీడర్ అంబులెన్స వ్యవస్థను ఏజెన్సీలో నిర్వహిస్తున్నప్పటి నుంచి చాలా మారుమూల గ్రామాల ప్రజలకు సౌలభ్యం చేకూరిందని వారు తెలిపారు ముఖ్యంగా ఆసుపత్రులకు రోగులను తీసుకు రావడానికి డోలి మోతలు తగ్గాయని, గర్భిణీలను ఫీడర్ అంబులెన్సులలో ఆసుపత్రులకు సురక్షితంగా తీసుకు వెళుతున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఫీడర్ అంబులెన్స వ్యవస్థను పటిష్ట పరచాలని డ్రైవర్లకు సక్రమంగా వేతనాలు చెల్లించాలని , ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కాంతారి శంకర్‌రావు కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి నెలకు 26 వేల వేతనం చెల్లించాలన్నారు. అంబులెన్సను మెరుగు పరిచి వినియోగంలోకి తీసుకురావాలని, డ్రైవర్ల సేవలను గుర్తించి సమస్యలను పరిష్కరించాలి.



రోగిని ఎక్కిస్తున్న అంబులెన్స్ డ్రైవర్

నేషనల్ టోర్నమెంట్‌కు ఇద్దరు బాక్సర్లు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నేషనల్ స్థాయి ఉషు టోర్నమెంట్‌కు నర్సీపట్నంకు చెందిన ఇద్దరు బాక్సర్లు పయనమయ్యారు. గత నెల ఉషూ అసోసియేషన్ నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ యూత్ చాంపియనిన్‌షిప్ టోర్నమెంట్‌ల నింజాస్ అకాడమీ క్రీడాకారులు విత్తనాల లోకేష్ 60కేజీలు(18), రౌతు నాగ లక్ష్మి 56 కేజీలు(18)లో బంగారు పతకాలు సాధించారు. దీంతో వీరు ఈ నెల 27 నుండి కోయంబత్తూరులో నేషనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని సీనియర్ కోచ్ యర్రా శేఖర్, ఎన్ఐఎస్ కోచ్ ప్రియాంక తెలిపారు. నేషనల్‌లో వీరు మంచి మెడల్స్ సాధించాలని అకాడెమీ డైరెక్టర్స్ ఆకాంక్షించారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. సీహెచ్.నాగాపురం గ్రామంలో సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు ఆధ్వర్యంలో శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ ఇంటి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సూచించారు. పాతకృష్ణదేవిపేట, కృష్ణదేవిపేట తదితర పంచాయతీల్లో చేపట్టారు.

శ్మశాన వాటికలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో శ్మశాన వాటిక వద్ద తుప్పల తొలగింపును శుక్రవారం చేపట్టారు. నేల చదును పనులు ప్రారంభించారు. బురదగా ఉండటంతో పనులకు ఆటంకం కలిగింది. నేల ఆరిన తరువాత తిరిగి పనులు ప్రారంభిస్తామని సర్పంచ్ తెలిపారు.

కల్యాణపులోవ నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి - కొత్తకోట:రావికమతం మండలం లో గుడివాడ గురునాధరావు కళ్యాణపులోవ జలాశయం లోకి చేరుతున్న వరద నీటిని రెండు గేట్ల ద్వారా సుమారు 100 క్యూ సెక్కుల నీటిని సర్పా నదిలో విడుదల చేసినట్టు జలాశయం ఏఈ సత్యనారాయణ దొర చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 460 అడుగుల కాగా ప్రస్తుతం 459.20 అడుగుల ప్రమాద స్థాయికి చేరిందన్నారు.. ప్రస్తుతం ఇన్ ఫ్లో 75 క్యూసుక్కుల నీరు జలాశయం లో చేరగా రెండు గేట్లు ద్వారా సాయంత్రం 100 క్యుసుక్కుల నీరు దిగువకు సర్పా నదిలోనికి విడుదల చేశామని వివరించా రు. పరివాహక ప్రాంతంలో ఇన్ ఫ్లో పెరిగే కొద్ది మిగిలిన గేట్ల ద్వారా దిగువకు (నది)లోనికి నీరును విడిచిపెట్టడం జరుగుతుందన్నారు సర్పానదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ మేరకు రెవిన్యూ శాఖ అధికారులకు సమాచారం అందజేసినట్టు పేర్కొన్నారు.

సంపద సృష్టి కేంద్రాలను వినియోగించాలి

ప్రజాశక్తి- కోటవురట్ల:మండల వ్యాప్తంగా నిర్మాణాలు పూర్తయిన సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని మండల ప్రత్యేక అధికారిని ఉదయశ్రీ సూచించారు. శుక్రవారం ఆమె మండలంలో బికేపల్లి, ఎండపల్లి గ్రామాలలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుద్ధమైన తాగునీటిని అందజేయాలని సూచించారు. బికేపల్లి గ్రామంలో ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు సకాలంలో పౌర సేవలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి స్వామి నాయుడు, కార్యదర్శి సంతోషి, సిబ్బంది పాల్గొన్నారు.

బురదమయంగా పాఠశాల రోడ్డు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని పెదపేట గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు సరైన రహదారి లేక పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యాశాఖాధికారులు, మండల ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి గ్రావెల్ వేయించుటకు నిధులు మంజూరు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పశుగ్రాసంపై పాడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంటలో శుక్రవారం పశుగ్రాసం ప్రాధాన్యతపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి నూకేశ్ మాట్లాడుతూ, పాల దిగుబడి పెరుగుదలకు ఆరోగ్యవం తమైన పిల్లల ఉత్పత్తి, వ్యాధినిరోధక శక్తి పెరుగుదల వంటివి పచ్చి మేత పశుగ్రాసంలో లభిస్తాయన్నారు. విత్తనాలు రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు.

'మీ కోసం'కు 75 వినతులు


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు:స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ "మీకోసం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ మండలాల నుండి అర్జీదారులు తరలి వచ్చారు. ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, జిల్లా రెవిన్యూ అధికారి బి.పద్మావతి హించారు. మీ కోసం కార్యక్రమానికి 75 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా పిఓ అభిషేక్ మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షం సమయంలో ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో పాడుపడిన భవనములు, చెట్ల కింద ఉండరాదని విజ్ఞప్తి చేసారు. గాలికి చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడే అవకాశం ఉన్నందున అనవసరంగా బయటకు రాకడదని సూచించారు. వినతులను స్వీకరించారు. జి.మాడుగుల మండలం గెమ్మిలి పంచాయతి కొలుంబొర్ర మహాదేవపురంకు చెందిన ఎం.రామచంద్ర పాత్రుడు తన బంజరు భూమి పది సెంట్లను చదును చేసుకొని వ్యవసాయం చేసుకుంటుండగా ఓ వ్యక్తి దౌర్జన్యం చేస్తున్నాడని మొర పెట్టుకున్నాడు. చింతపల్లి గ్రామానికి చెందిన కాగి వెంకయ్యమ్మ తన ఇంటి స్థలంలో గిరిజనేతరుడు ఇల్లు నిర్మించుకున్నారని, అడిగితే హేళనగా మాట్లాడుతున్నారని ఫిర్యాదు చేసింది.ఆ ఇంటిని తొలగించి స్థలము ఇప్పించాలని, ఆమె కోరింది. అరకువేలి మండలం పెదలబుడు గ్రామ పంచాయతి తాంగులగుడ గ్రామానికి చెందిన కిల్లో గోవర్దన్ వ్యవసాయ బోరు వేయించు కొని విద్యుత్ సరఫరాకు అర్జీ చేసుకున్నప్పటికీ కనెక్షన్ ఇవ్వలేదని దరఖాస్తు చేసాడు. అరకువేలి మండలం మడగడ పంచాయతి గంగగుడ్డి గ్రామస్తులు వి.సింగ్, వి.పిల్కు రేషన్ కార్డుల మంజూరుకు వినతిపత్రం అందజేశారు. అరకువేలి మండలం మడగడ పంచాయతి వంతమూరు గ్రామస్తులు తాగునీటి సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒలు ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ కొండలరావు, జిల్లా మత్స్యశాఖాధికారి పి.శ్రీనివాసరావు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎ.రమేష్ కుమార్, జిల్లా కార్మిక శాఖ అధికారి టి.సుజాత, జిల్లా రవాణా శాఖాధికారి ఎస్.లీలా ప్రసాద్, ఆర్టిసి డిఎం వి.శ్రీనివాసరావు, డిఆర్డిఎ పీడీ వి.మురళి పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద...

ఇష్టానుసారంగా పడేసిన కాలం చెల్లిన మందులు


భవనాల వద్ద ఉన్న కాలం చెల్లిన మందులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ ఆరోగ్య ఉపకేంద్రం భవనం, అంగన్వాడి కేంద్రం సమీపాన కాలం చెల్లిన మందులు కుప్పలు కుప్పలుగా పడేశారు. దీంతో, చుట్టుపక్కల సంచరించే మూగజీవాలు వాటిని తిని అనారోగ్యం పాలై చివరకు మరణించే పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పక్కన అంగన్వాడి కేంద్రం, గ్రామ సచివాలయం ఉంది. ప్రాథమిక ఆరోగ్య, పాఠశాలలు ఉన్నాయి. ఈ మందుల నుంచి విపరీతమైన దుర్గంధం వస్తున్న కారణంగా బాలింతలు, గర్భిణులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మందులు పడవేయడం ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయభారతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ, కార్గిల్లో భారత్ విజయం మన దేశ సైనికుల త్యాగానికి ప్రతీక అని అన్నారు.ప్రతి సంవత్సరం జులై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నామన్నారు.తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమణ, కేజీయ, సంతోషి, లీలా పావని, నాయక్, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, నాగేంద్రబాబు, శ్రీనివాస్, సతీష్, నాని, రమణ, ప్రమీల, లైబ్రేరియన్ జగత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

నేరాలు ఘోరాలు

వెన్నునొప్పి తాళలేక ఆత్మహత్య

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బోదువలస గ్రామానికి చెందిన గొల్లవిల్లి రాజేశ్వరి (34) వెన్నునొప్పి తాళలేక కలుపు మొక్కల నివారణ కోసం వాడే పురుగుల మందు తాగి మృతి చెందినట్లు స్థానిక సిఐ పిన్నింటి రమణ తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం... బోదువలస గ్రామానికి చెందిన గొల్లవిల్లి రాజేశ్వరి (34) గతంలో మేడపై నుండి జారిపోవడంతో వెన్నుముక భాగం దెబ్బ తగిలి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు వెన్నుముకకు ఆపరేషన్ చేయాలని సూచించారు. దీంతో రాజేశ్వరికి ఆర్థిక స్తోమత లేక వైద్యం చేయించుకోవడానికి డబ్బు లేకపోవడంతో మనస్థాపానికి గురై శుక్రవారం కలుపు మొక్కల నివారణకు ఉపయోగించే (పెస్టిసైడ్) పురుగుల మందు తాగింది. అనంతరం ఆమె వాంతులు చేసుకోవడం ఆమె చిన్న కుమార్తె చూసి తండ్రికి ఫోన్ చేయడంతో రాజేశ్వరి భర్త అప్పలరాజు విశాఖ కెజిహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో రాజేశ్వరి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు సుస్మిత, ప్రవల్లికలు ఉన్నారు. భర్త అప్పలరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిఎం.పాలెంలో చోరీ

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ రంభ శ్రీనివాసరావు తెలిపారు. పిఎం.పాలెం ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న మణికంఠ ట్రేడర్స్ దుకాణం షటర్లు తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగలు గొట్టి కొన్ని బియ్యం బస్తాలు, రూ. 5 వేలు చోరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. షాప్ యజమాని కొండలరావు అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. వారి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రంగురాళ్ల క్వారీ వద్ద పహారా

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టిపాలెం రంగురాళ్ల క్వారీ వద్ద రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది పహారా కాస్తున్నారు. పగలు, రాత్రి కలిపి రోజుకు ఏడుగురు బందోబస్తు నిర్వహిస్తున్నారు. క్వారీ ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని గొలుగొండ ఎస్సై కృష్ణారావు తెలిపారు. ఎవరైనా తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పప్పుశెట్టిపాలెంలో గ్రామసభ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో పంచాయితీ ద్వారా నిర్వహించిన పనులు, వాటికి ఖర్చు చేసిన నిధులపై చర్చించారు. రెవెన్యూ పరిధిలో ఇచ్చిన పట్టాలపై పలువురు ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, కార్యదర్శి రఘురాం, సచివాలయ కార్యదర్శి శ్యామ్‌కుమారి, వార్డు మెంబర్లు, మాజీ సర్పంచ్ బెల్లపు కొండలరావు, గొడ్డెటి రాజుబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాండవ కాలువలో పూడిక తీయాలి

ప్రజాశక్తి-నాతవరం:మండల కేంద్రంలో సెక్షన్ కార్యాలయం వద్ద తాండవ రిజర్వాయర్ నీటి విడుదలపై రైతులతో సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. రైతుల అభిప్రాయం మేరకే తాండవ నీటిని విడుదల చేస్తామని తాండవ ప్రాజెక్ట్ డిఈ అనురాధ తెలిపారు. ప్రస్తుత తాండవ జలాశయంలో 371 అడుగులు నీరు ఉందన్నారు. ఈ సమావేశంలో రైతులు మాట్లాడుతూ, తాండవ జలాశయం నుండి నీటిని విడుదల చేసే ముందు తాండవ ఎడమ, కుడి కాలువలో మట్టిని, తుప్పలను తొలగించాలని కోరారు. ఆగస్టు 15 తర్వాత నీటిని విడుదల చేస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం డిఈ అనురాధ, మాజీ జడ్పిటిసి సత్యనారాయణ , టిడిపి నాయకులు తాండవ నదిపై ఉన్న కెనాల్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జడ్పిటిసి కాపారపు అప్పల నరస, మాజీ జెడ్పిటిసి కనక సత్యనారాయణ, నాతవరం టిడిపి అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం టిడిపి పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగ స్వామి, కనక రాజు, పైల పోతురాజు, పారుపల్లి కొండబాబు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి -కోటవురట్ల:లంపి స్కిన్ వ్యాధి రాకుండా పశువులకు టీకాలు వేయించుకోవాలని లైవ్ స్టాక్ అసిస్టెంట్ శ్రీనివాస్ సూచించారు. ఈ వ్యాధి సోకితే రైతులకు తీవ్రమైన ఆర్థికనష్టం కలుగుతుందని తెలిపారు. పలు గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు.


డొంకరాయి జలాశయం

కొనసాగుతున్న నీటి విడుదల

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం ఆరో నెంబరు గేటు ద్వారా 2173 క్యూసెక్కులు నీటిని యథావిధిగా దిగు ప్రాంతానికి విడుదల కొనసాగుతుందని డొంకరాయి ఈఈ పి.విజయ్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ డొంకరాయి జలాశయంలో నీటి నిల్వలు స్థిరంగా 1335.50 వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. నిరంతరాయంగా వర్షాలు పడుతుండడంతో డొంకరాయి పరిసర ప్రాంతాల్లోని కొండలపై నుంచి, వలసగెడ్డ, పాలగెడ్డ వాగుల నుంచి రోజుకి 4000 నుంచి 4500 క్యూసెక్కులు వరద నీరు డొంకరాయి జలాశయంలో చేరుతుందని వెల్లడించారు. దీంతో నీటిమట్టలు ప్రమాద స్థాయికి చేరకుండా, ఎప్పటికప్పుడు రిజర్వాయర్ లెవెల్స్ పర్యవేక్షిస్తూ ఆరో నెంబరు గేటు రెండు అడుగులకు లేపి 2173 క్యూసెక్కులు నీటిని దిగు ప్రాంతానికి విడుదల చేస్తున్నామని చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పట్టి ఇన్‌ఫ్లో తగ్గి, డొంకరాయి జలాశయంలో 1335 అడుగులకు చేరుకుంటే దిగు ప్రాంతానికి నీటి విడుదలను నిలిపివేస్తామని చెప్పారు.

తాడు సాయంతో కొండవాగు దాటిన లైన్‌మ్యాన్

ప్రజాశక్తి -మారేడుమిల్లి

విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా తాళ్ల సహాయంతో పొంగి ప్రవహిస్తున్న వాగులను దాటుతూ విద్యుత్ లైన్‌మ్యాన్లు విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నారు. రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని సున్నంపాడు, నూరుపూడి గ్రామాలను కలుపుతూ ఉన్న రోడ్డు మార్గంలో కొండ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో దూదిపూడి జంక్షన్ నుండి నూరుపూడి గ్రామాలకు కరెంట్ సౌకర్యం కల్పించడానికి లైన్మెన్లు రామయ్య, నీలన్నదొర వేరే మార్గం లేకపోవడంతో కాలువ మీద ఏర్పాటు చేసిన తాళ్ల సహాయంతో ప్రాణాలు అరచేత పెట్టుకొని వాగు దాటి కరెంట్ సరఫరా చేశారు. ఈ వాగుపై కల్వర్టు నిర్మాణానికి గతంలో వైసిపి, టిడిపి ప్రభుత్వాలు శంకుస్థాపనలు చేసి వదిలేశాయి. వంతెన నిర్మాణం పూర్తి చేయకపోవడంతో వర్షా కాలంలో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఉన్న లోతట్టు గ్రామాలకు రహదారులు, కలవర్టులు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ప్రమాదకర కొండవాగును తాడు సాయంతో దాటుతున్న లైన్‌మ్యాన్

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : అమెరికా శ్రీసాయి పరబ్రహ్మ మిషన్, రాజమండ్రి స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆర్థిక సహాయంతో మండలం బి.వెలమలకోట, బీరంపల్లి పంచాయతీలో అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న గర్భిణీలు, బాలింతలు సుమారు 35 మందికి రూ.26 వేలు విలువైన పౌష్టికాహార కిట్లు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కెఎస్ మూర్తి మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన మహిళలు ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, వారు మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కిట్లలో కందిపప్పు, పెసరపప్పు, బెల్లం, మంచి నూనె, చోడిపిండి, గోధుమపిండి, ఉప్పు, మినపప్పు, వేరుశనగ గుళ్ళు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సరస్వతి, కే స్వర్ణలత, పద్మిని పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-రంపచోడవరం, రాజవొమ్మంగి

అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయదేవి అన్నారు. జిల్లాలోని రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం మండలాల్లోని సిడిపిఓ కార్యాలయాలను గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలు, గర్భిణీలు, బాలింతల వివరాలు, ఫీడింగ్ తదితర వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ జోన్ పరిధిలో మొత్తం 68 ఐసిడిఎస్ ప్రాజెక్టులు, సుమారు 13,819 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వీటిల్లో సుమారు 1052 సమస్యాత్మక అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, వీటికి సరుకులు పంపించేందుకు కొద్దిపాటి ఇబ్బందులున్నా పూర్తి స్థాయిలో సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కేంద్రాల్లో 60,919 మంది గర్భిణీలు, 57,376 మంది బాలింతలు, ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలు 319,315 మంది, మూడు నుండి ఆరు సంవత్సరాల మధ్య వయసుగల పిల్లలు 2,82,581 మంది ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల సిడిపివోలు, అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జెడి చిన్మయదేవి

పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఎంపిపి గోమ వెంకటలక్ష్మి అన్నారు. ఈనెల 25 నుండి ఆగస్టు 10వ తేదీ వరకు సెంట్రేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాల్లో భాగంగా రాజవొమ్మంగి సచివాలయంలో సర్పంచ్ ముసలి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలో వరదనీటి ప్రవాహంతో అపారిశుధ్యం తాండవించి, తాగునీరు కలుషితమై ప్రజలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం చంద్ర గ్రామంలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలలో లిక్విడ్ బ్లీచింగ్ జలుతూ ఇంటి పరిసరాల్లో నీటినిలో లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, గోవింద్ విద్య కమిటీ చైర్మన్ కేసిరెడ్డి శివ, సచివాలయ సిబ్బంది శ్రావణి, అప్పారావు, శాంతి, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఎంపిహెచ్ఓ, వెలుగు వివోఏ అనివిరెడ్డి కాశి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో ఎ.వీర కిషోర్ ఆదేశాల మేరకు మండలంలోని బోదులూరు, మారేడుమిల్లి తదితర పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా వర్కర్లు శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామాల్లో ఉన్న డ్రైన్ పూడికలు, చెత్తాచెదారం పంచాయతీ సిబ్బంది చేత తొలగింపజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రెటరీ విజయ్, పరమేశ్వరి మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను గురించి ప్రజలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్వాడి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానిక ఎంపీడీవో లోకల యాదగిరిశ్వరరావు ఆదేశించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజవొమ్మంగి, దూసరపాము తదితర పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది చేపడుతున్న కార్యక్రమాలను శుక్రవారం ఎంపీడీవో పర్యవేక్షించారు. గ్రామాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని, డ్రైన్లు పూడికతీతతో పాటు, గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దూసరపాము గ్రామ సర్పంచ్ చీడి శివ, ఐసిడిఎస్ సిడిపిఓ దేవామణి, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న రాజవొమ్మంగి అధికారులు

డిపి ఏర్పాటు చేస్తాం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారాలమ్మ అమ్మవారి ఆలయానికి విద్యుత్ సరఫరా అయ్యే డిపి పని చేయడం లేదని, దాని స్థానంలో వేరొక కొత్త డిపిని అమర్చి ఆలయానికి విద్యుత్ సరఫరా అయ్యే విధింగా చూస్తామని విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు. దారాలమ్మ ఆలయానికి పది రోజులుగా విద్యుత్ సరఫరా కావడం లేదు. దీనిపై స్థానికులు దారకొండ ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది శుక్రవారం ఆలయం వద్ద చేరుకొని కరెంటు సరఫరా డిపిని తనిఖీ చేశారు. అది పని చేయడం లేదని నిర్ధారణ కావడంతో కొత్తది ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ తనిఖీల్లో లైన్మెన్ జి.కన్నాలు, షిఫ్ట్ ఆపరేటర్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాకాంబరి దేవిగా దారాలమ్మ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్‌లోని దారాలమ్మ అమ్మవారం శుక్రవారం శాకాంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దారకొండ గ్రామానికి చెందిన అనుమాల శెట్టి దంపతులు, వి.చిన్న దంపతులు ఆర్థిక సహాయంతో అమ్మవారిని పువ్వులు, పండ్లు, వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి దేవిగా రూపకల్పన చేశారు. జోరువానలోనూ దారకొండ, సీలేరు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

కాకినాడ జిజిహెచ్‌కు బాలింత తరలింపు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని రాజవొమ్మంగి కన్నయ్యపేటకు చెందిన పప్పుల దివ్య అనే బాలింతను మెరుగైన వైద్యం కోసం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి సుష్మా చొరవ తీసుకొని అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు. పప్పుల దివ్య ఇటీవల ఏడవ నెలలో తక్కువ బరువుతో ఉన్న కవల పిల్లలకు జన్మనిచ్చింది. అప్పటినుండి సుమారు 18 రోజులు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొంది చేతిలో డబ్బులేక ఇబ్బందుల నేపథ్యంలో దివ్య కుటుంబ సభ్యులు బాలింతను రాజవొమ్మంగిలోని తమ ఇంటికి తీసుకొచ్చేశారు. ఈ విషయం తెలుసుకున్న పీహెచ్సీ వైద్యాధికారి సుష్మా శుక్రవారం బాలింత దివ్య ఇంటికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు. ఇరువురు పసికందులు బరువు తక్కువతో బాటు, దివ్య కూడా నీరసంగా ఉండడంతో వైద్యాధికారి సుష్మ కొంత సొమ్ము ఇచ్చి అంబులెన్స్‌లో పిహెచ్‌సి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్త సహాయంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు.

అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలు ప్రస్తావన

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి శుక్రవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిర్వాసితులకు ఇవ్వవలసిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించి వారికి పూర్తి మౌలిక సదుపాయాలతో పునరావాసం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం గోదావరి వరదల సందర్భంగా సుమారు 5 మండలాల్లోని 35 కుటుంబాలు గోదావరి వరద ఉధృతికి కొండలపై గుట్టలపై తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడ జీవిస్తున్నారని, వీరికి పునరావాసం కల్పిస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. జీవో నెంబర్ 3 రద్దు కావడంతో గిరిజన ప్రాంతాల్లోని నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని, ఆ సమస్యను పరిష్కరించాలని, ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో కూడా ఏజెన్సీ ప్రాంత వాళ్లకి మినహాయింపు కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగాల సమస్యను పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీ ద్వారా సీఎం దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాల్తేరు డివిజన్‌లో రైళ్ల రీషెడ్యూల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్‌లో పుండి - నౌపడ విభాగంలో భద్రత, ఆధునికీకరణ పనుల కారణంగా జూలై 29, ఆగస్ట్ 1, 3 తేదీలలో పలు రైళ్లను రీషెడ్యూల్, షార్ట్ టర్మినేట్ చేశారు. ఈ నేపథ్యంలో రైలు నెంబర్ 12830 భువనేశ్వర్ - ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 1న సాధారణ షెడ్యూల్ సమయం 12:10 గంటలకు బదులు గంట ఆలస్యంగా 13.10 గంటలకు రానుంది. 22974 పూరీ - గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 3వ తేదీన సాదారణ షెడ్యూల్ సమయం 11:15 గంటలకు బదులు గంటా 30 నిమిషాలు ఆలస్యంగా 12:45 గంటలకు రీషెడ్యూల్ చేయబడింది. 22879 భువనేశ్వర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ 3వ తేదీన సాధారణ షెడ్యూల్ సమయం 12:10 గంటలకు బదులు గంట ఆలస్యంగా 13.10 గంటలకు రీషెడ్యూల్ అయింది. అదేవిధంగా 07470 విశాఖపట్నం - పలాస మెము జూలై 29, ఆగస్టు 1, 3 తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో షార్ట్ టర్మినేట్ చేయబడింది.